హైబ్రిడ్‌కు ఓకే అంటేనే ఆతిథ్యం

లేదంటే పాక్ అవతల చాంపియన్స్ ట్రోఫీ • పీసీబీకి ఐసీసీ అల్టిమేటం

దుబాయ్: పాకిస్థాన్‌లో ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యంపై సందిగ్ధత కొనసాగుతున్నది. షెడ్యూల్ ప్రకారం పాక్ వేదికగా వచ్చే ఫిబ్రవరిలో చాంపియన్స్ ట్రోఫీ జరుగాల్సి ఉంది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా తాము పాక్‌లో పర్యటించలేమంటూ భారత్ స్పష్టం చేయడంతో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. శుక్రవారం వర్చువల్‌గా జరిగిన ఐసీసీ భేటీలో పలు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యమివ్వాలంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) హైబ్రిడ్ మోడల్‌కు ఒప్పుకోవాల్సిందేనని, ఒకవేళ ససేమిరా అంటే ఆతిథ్యానికి వదులుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఐసీసీ అల్టిమేటం జారీ చేసింది. దుబాయ్‌లో జరిగిన ఈ అత్యవసర భేటీలో పీసీబీ చీఫ్ మోహిసిన్ నఖ్వి స్వయంగా హాజరయ్యాడు. 'ప్రస్తుతమున్న పరిస్థితుల్లో పీసీబీ హైబ్రిడ్ మోడల్‌కు ఒప్పుకోవాల్సిందే. ఒకవేళ ఇందుకు అంగీకరిస్తే..భారత్ ఆడే చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు యూఏఈలో జరుగుతాయి. ఇదే జరిగితే బ్రాడ్‌కాస్టర్లు ఐసీసీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వరు. హైబ్రిడ్ మోడల్‌కు పీసీబీ ఓకే అంటేనే శనివారం భేటీ జరుగుతుంది. లేకుంటే మొత్తానికి మొత్తంగా చాంపియన్స్ ట్రోఫీని పాక్ నుంచి తరలించి వేరే దేశంలో నిర్వహిస్తుంది' అని ఐసీసీ సభ్యుడొకరు పేర్కొన్నాడు. ఇదిలా ఉంటే డిసెంబర్ 1న జై షా ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు అందుకోబోతున్నాడు.

భారత్ పాక్‌కు వెళ్లదు: విదేశాంగ శాఖ

చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు పాకిస్థాన్‌కు వెళ్లేది లేదని ఇది వరకే బీసీసీఐ స్పష్టం చేయగా తాజాగా కేంద్ర విదేశాంగ శాఖ కూడా తమ నిర్ణయాన్ని వెల్లడించింది. భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ శుక్రవారం మాట్లాడుతూ.. 'పాకిస్థాన్‌లో భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతాయని బీసీసీఐ ఆందోళనలో ఉంది. మేం దీనిని పరిగణనలోకి తీసుకున్నాం. భారత జట్టు పాకిస్థాన్‌కు వెళ్లే అవకాశం లేదు' అని స్పష్టం చేశారు.

పాక్‌లో ఆడితే నిషేధం

చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై అనిశ్చితి కొనసాగుతున్న వేళ పీసీబీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో తమ దేశానికి చెందిన క్రికెటర్లె వరూ పాల్గొనవద్దని, తమ ఆదేశాలను బేఖాతరు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తమ దేశ ఆటగాళ్లను హెచ్చరించింది. పీఎస్ఎల్‌లో ఆడేందుకు తాము నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్స్ (ఎన్‌వోసీ) మంజూరు చేయబోమని స్పష్టం చేసింది. ఏప్రిల్-జులై మధ్య ఇంగ్లండ్‌లో దేశవాళీ సీజన్ నడుస్తుంది. అందుకే ఆ సమయంలో క్రికెటర్లందరూ కచ్చితంగా దేశవాళీ సీజన్‌లో ఆడాలని తెలిపింది.

నాలుగో గేమ్ డ్రా

హోరాహోరీగా ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్

సింగపూర్: భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్, చైనా ఆటగాడు డింగ్ లిరెన్ మధ్య సింగపూర్ వేదికగా ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ హోరాహోరీగా సాగుతోంది. శుక్రవారం ఈ ఇరువురి మధ్య జరిగిన నాలుగో గేమ్ డ్రాగా ముగిసింది. దీంతో 14 గేమ్‌లు ఉన్న ఈ టోర్నీలో 4 గేమ్‌లు ముగిసేసరికి ఇరువురి ఖాతాలో తలా 2 పాయింట్లు చేరాయి. తొలి మ్యాచ్‌లో మాదిరిగానే ఆరంభం నుంచే దూకుడుగా ఆడేందుకు లిరెన్ యత్నించాడు. ప్రారంభంలో అతడి పావుల కదలిక అలాగే సాగింది. కానీ గుకేశ్ ఎక్కడా ఒత్తిడికి గురికాకుండా బదులివ్వడంతో అతడు వెనక్కి తగ్గాడు. ఆట మధ్యలోకి వచ్చేసరికి ఇరువురూ పలు తప్పిదాలు చేశారు. ఈ క్రమంలో జాగ్రత్త పడ్డ గుకేశ్, లిరెన్.. గేమ్ కోల్పోకుండా సేఫ్‌గా ఆడారు. 42 ఎత్తుల తర్వాత ఆట డ్రా గా ముగిసింది. శనివారం ఐదో గేమ్ జరుగనుంది.

అడిలైడ్‌కు సన్నాహం

నేడు ప్రైమినిస్టర్ లెవెన్‌తో భారత్ ప్రాక్టీస్ మ్యాచ్ • శుభమన్ గిల్ రీఎంట్రీకి చాన్స్

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా తొలి టెస్టులో కంగారూలపై భారీ తేడాతో గెలిచి జోరుమీదున్న భారత క్రికెట్ జట్టు శనివారం నుంచి ప్రైమినిస్టర్ లెవన్‌తో రెండ్రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌కు సిద్ధమైంది. వచ్చేనెల 6 నుంచి అడిలైడ్ వేదికగా జరుగబోయే డే అండ్ నైట్ పింక్ టెస్టుకు ముందు టీమ్‌ఇండియాకు ఇది మంచి సన్నాహకంగా ఉపయోగపడనుంది. పెర్త్ టెస్టులో ఆడని రోహిత్‌శర్మ ఈ మ్యాచ్‌లో ఆడనుండగా వేలి గాయంతో తొలి మ్యాచ్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్ అడిలైడ్ టెస్టు ఆడతాడా? లేదా? అన్నదానిపై స్పష్టత వచ్చే అవకాశముంది. శుక్రవారం అతడు నెట్స్‌లో సాధన చేశాడు. రోహిత్ రాకతో కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చుతారా? లేక సారథే వన్ డౌన్‌లో వస్తాడా? అన్నది సరిచూసుకోవడానికి ప్రాక్టీస్ మ్యాచ్ భారత్‌కు మంచి అవకాశం. పెర్త్ టెస్టులో భారీ విజయంతో మెండైన ఆత్మవిశ్వాసం సొంతం చేసుకున్న టీమ్‌ఇండియా..ప్రాక్టీస్ మ్యాచ్‌లో ప్రయోగాలు చేసే అవకాశముంది. ముఖ్యంగా కెప్టెన్ రోహిత్‌పై ప్రధానంగా దృష్టి నెలకొంది. రెండో సంతానం కోసం స్వదేశంలోనే ఉండిపోయిన హిట్‌మ్యాన్ పెర్త్ టెస్టుకు దూరమయ్యాడు. ప్రాక్టీస్ మ్యాచ్ కోసం జరిగిన నెట్ ప్రాక్టీస్‌లో రోహిత్ మంచి టచ్‌లో కనిపించాడు. చివరిసారి అడిలైడ్‌లో జరిగిన డే అండ్ నైట్ టెస్టులో టీమ్ ఇండియా 36 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ బౌలింగ్ ధాటికి టెస్టుల్లో భారత్ అత్యల్ప స్కోరును మూటగట్టుకుంది. తిరిగి అలాంటి చెత్త ప్రదర్శన పునరావృతం కావద్దన్న ఉద్దేశంతో ఉన్న టీమ్ ఇండియా తప్పులకు ఆస్కారం లేకుండా ముందుకు సాగుతున్నది. రోహిత్‌కు తోడు గిల్ తుది జట్టులోకి వస్తే.. మార్పులు, చేర్పులు జరుగుతాయి. దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్‌ను తప్పించే చాన్స్ ఉంది. దీనికి తోడు జైస్వాల్‌కు తోడుగా ఓపెనర్‌గా రోహిత్ లేదా రాహుల్ వస్తాడా అన్న దానిపై ప్రాక్టీస్ మ్యాచ్ ద్వారా ఒక స్పష్టతకు రానున్నారు. బౌలింగ్ విభాగంలో రిజర్వ్ బెంచ్‌ను పరీక్షించే అవకాశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియా విషయానికొస్తే.. స్కాట్ బొలాండ్, హన్నో కోబ్స్ వంటి పేసర్లు ప్రైమినిస్టర్ లెవెన్‌లో బరిలో దిగబోతున్నారు. జాక్ ఎడ్వర్డ్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, అండర్-19 ప్లేయర్లు చార్లీ అండర్సన్, మహ్లీ బియర్డ్‌మన్, ఐడన్ ఒ కానర్, సామ్ కొన్సాస్ ఉన్నారు.

హైదరాబాద్‌కు రెండో విజయం

రాజ్‌కోట్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (స్మాట్)లో హైదరాబాద్ మళ్లీ గెలుపుబాట పట్టింది. రాజ్‌కోట్‌లో బీహార్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన బీహార్ 20 ఓవర్లలో 118/9 పరుగులకే పరిమితమైంది హైదరాబాద్ బౌలర్ టేకులపల్లి రవితేజ (4/24) రాణించాడు. అనంతరం లక్ష్యాన్ని హైదరాబాద్ 12.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదనను పూర్తి చేసింది. రోహిత్ (56 నాటౌట్), కెప్టెన్ తిలక్ వర్మ (51 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. స్మాట్‌లో ఆడిన 4 మ్యాచ్‌లలో హైదరాబాద్‌కు ఇది రెండో విజయం.

ఓటమి అంచున లంక

• లక్ష్యం 526, ప్రస్తుతం 103/5

డర్బన్: దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న శ్రీలంక తొలి టెస్టులో ఓటమి అంచున నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగులకే ఆలౌట్ అయిన ఆ జట్టు ఎదుట సఫారీలు రెండో ఇన్నింగ్స్‌లో 516 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపారు. అయితే మూడో రోజు ఆట ముగిసే సమయానికి లంకేయులు.. 31 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేశారు. ఆ జట్టు ఇంకా 413 పరుగులు వెనుకబడి ఉంది. ప్రధాన బ్యాటర్లంతా పెవిలియన్ చేరిన నేపథ్యంలో ఆ జట్టుకు భారీ ఓటమి తప్పేలా లేదు. దినేశ్ చండిమాల్ (29 నాటౌట్), ధనంజయ డి సిల్వ క్రీజులో ఉన్నారు. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా.. 366/5 వద్ద సెకండ్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ట్రిస్టన్ స్టబ్స్ (122), సారథి టెంబ బవుమా (113) శతకాలతో మెరిశారు.

సెమీస్‌కు సింధు

అదరగొట్టిన లక్ష్యసేన్, ఉన్నతి

లక్నో: గత రెండేండ్లుగా బీడబ్ల్యూఎఫ్ టైటిల్ వేటలో ఉన్న పీవీ సింధు ఆ కొరతను తీర్చుకునే దిశగా కీలక ముందడుగు వేసింది. లక్నోలో జరుగుతున్న సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఆమె సెమీ ఫైనల్స్‌లోకి అడుగుపెట్టింది. ప్రిక్వార్టర్స్‌లో కష్టమ్మీద నెగ్గిన 18వ ర్యాంకర్ సింధు.. శుక్రవారం ఇక్కడ జరిగిన క్వార్టర్స్‌లో 21-15, 21-17తో డై వాంగ్ (చైనా)పై గెలిచింది. 48 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో సింధు.. అంతగా అనుభవం లేని చైనా అమ్మాయిపై అలవోక విజయం సాధించింది. సెమీస్‌లో ఆమె భారత్‌కే చెందిన ఉన్నతి హుడాతో అమీతుమీ తేల్చుకోనుంది. మరో క్వార్టర్స్‌లో ఉన్నతి 21-16, 21-9తో ఇషికా జైస్వాల్ (యూఎస్ఏ)ను ఓడించి సింధుతో పోరుకు సిద్ధమైంది. ఇక పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 21-8, 21-19తో మీరబ లువాంగ్(భారత్)ను ఓడించి సెమీస్‌లోకి ప్రవేశించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీ, మహిళల డబుల్స్‌లో రెండో సీడ్ త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్ ద్వయం సైతం సెమీస్‌కు అర్హత సాధించాయి.

ఇంగ్లండ్ దీటుగా

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ దీటుగా బదులిస్తోంది. యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (132 నాటౌట్) మెరుపు శతకంతో మెరవడంతో ఆ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. బ్రూక్‌తో పాటు ఓలీ పోప్ (77), బెన్ డకెట్ (46), కెప్టెన్ బెన్ స్టోక్స్ (37 నాటౌట్) రాణించారు. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 319/8తో రెండో రోజు క్రీజులోకి వచ్చిన కివీస్ 348 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లీష్ జట్టు ఇంకా 29 పరుగులు వెనుకబడి ఉంది.

సత్తాచాటిన టీటీ ప్లేయర్లు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఇండోర్(మధ్యప్రదేశ్) వేదికగా జరిగిన యూటీటీ జాతీయ పారా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ప్లేయర్లు సత్తాచాటారు. పురుషుల ఫైనల్లో హితేశ్ దోల్వాని 11-6, 11-5, 11-4తో విశ్వ తంబె(మహారాష్ట్ర)పై గెలిచి టైటిల్ విజేతగా నిలిచాడు. మహిళల క్లాస్-4 తుది పోరులో విజయ దీపిక 10-12, 7-11, 9-11తో భవీనా పటేల్(గుజరాత్) చేతిలో రన్నరప్‌గా నిలిచింది. మహిళల క్లాస్ 8లో నిశాకుమారి 4-11, 5-11, 9-11తో సవితా అంజనకట్టి(కర్నాటక) చేతిలో ఓడి రజతం దక్కించుకుంది.

11 మంది బౌలర్లే

• టీ20లలో అరుదైన దృశ్యం

ముంబై: టీ20 క్రికెట్ చరిత్రలో మునుపెన్నడూ కనీవినీ ఎరుగని విధంగా ఢిల్లీ క్రికెట్ జట్టు తమ 11 మందిని బౌలింగ్ చేయించింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఇందుకు వేదికైంది. శుక్రవారం గ్రూప్-సీలో మణిపూర్‌తో మ్యాచ్ సందర్భంగా ఢిల్లీ తమ ఫైనల్ లెవన్‌లో ఉన్న ప్రతి ఒక్కరితో (వికెట్ కీపర్‌తో సహా) బౌలింగ్ చేయించింది. పొట్టి క్రికెట్‌లో ఇలా జరుగడం ఇదే ప్రథమం. ఢిల్లీ బౌలర్లలో ఐదుగురు ఒక్కో ఓవర్ వేయగా ముగ్గురు తలా మూడు ఓవర్లు విసిరారు. మరో ఇద్దరు చెరో రెండు ఓవర్ల చొప్పున బౌలింగ్ చేశారు. ఈ మ్యాచ్‌లో మణిపూర్ 120/8 పరుగులకే పరిమితమవగా ఆ లక్ష్యాన్ని ఢిల్లీ 18.3 ఓవర్లలోనే ఛేదించింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.